# గురునానక్

*తల్లి త్రిప్తాదేవి. తండ్రి శ్రీకాళుడు. వీరిద్దరి బిడ్డడే గురునానక్. దయాప్రేమలతో కూడిన పౌరుషము మానవుల స్వరూపమనియు, సత్యమార్గమున దైవమును సేవించుచూ, కర్తవ్యకర్మలాచరించుచూ పరమాత్ముని చేరవచ్చునని బోధించెను. దొంగతనము మహాపాతకమని. ఇట్టి గుణము మానవత్వమునకు పరమ విరుద్ధమనియు, అట్టి అన్యాయ అక్రమ అనాచార అధర్మ ప్రవర్తనలను అణగద్రొక్కుటకు పౌరుషము మానవునకు తగినట్లుగా ఉండవలెననియు, పరులను హింసించి జీవితమును గడుపు ఉపాయమును వెతుకుట ప్రధాన కర్తవ్యమనియు తెలిపెను. సన్మార్గ ప్రవర్తనలే సర్వేశ్వరుని చేరుటకు సరైన రాజబాటయని కూడను నొక్కి చెప్పెను. ఇతని బోధనలననుసరించి దీక్షనుపూని మోక్షము సాధించ ప్రయత్నించు వారల మతమే శిక్కుమతమని పిలువబడుచున్నది.*

గురునానక్ దేశసంచారం చేస్తూ, ఆధ్యాత్మిక ప్రబోధలు చేస్తూ ప్రజలలో ఆధ్యాత్మిక చింతనలు అభివృద్ధి చేసేవాడు. ఒకసారి ఆయన హృషీకేశము వెళ్ళాడు. అక్కడి నుంచి కొంతమంది యాత్రికులతో బదరీ వెళ్ళాడు. బదరీలో పితృదేవతలకు పిండం పెట్టటం ఒక సాంప్రదాయం. అట్లు పిండం పెడితే పిత్రుదేవతలకు మరల జన్మ వుండదని మన దేశంలో ఒక విశ్వాసం. పిండాలు పెట్టించటానికి 'పాండాలు' అని కొందరు వుంటారు. వారు ఈ క్రతువును జరిపిస్తూ వుంటారు. ఈ పిండములు స్వర్గములోనున్న వారి పెద్దలకు చేరుతాయని బోధిస్తూ వుంటారు ఈ పండాలు.

గురునానక్ ఈ క్రతువును చూచాడు. తరువాత నదిలో దిగి తూర్పువైపునకు తిరిగి, దోశిలితో నీరు తీసి చల్లటం ప్రారంభించాడు. అక్కడ వున్న పండాలు, పిండాలు పెట్టే గృహస్తులు నానక్ చేసే వింత చర్యను గమనించారు. 'ఏమిటి? ఈ పిచ్చి పనులు? నదిలోని నీరు తీసి తూర్పువైపు చల్లుతున్నాడు' అని హాస్యంచేస్తూ విమర్శించటం మొదలు పెట్టారు. అందరూ హాస్యం చేసేకొద్దీ నానక్ నీటిని మరింత జోరుగా చల్లటం ప్రారంభించాడు. అక్కడున్నవారందరిపైనా చల్లాడు. పాండాలకు కోపం వచ్చింది. వారు నానక్‌తో, 'ఎందుకయ్యా ఆవిధంగా నీరు చల్లుతున్నావు?' అని గద్దించి ప్రశ్నించారు. అపుడు నానక్ పరమశాంతముగా 'అయ్యలారా! పంజాబులో మోగ అనే గ్రామములో మాకు మామిడితోట వుంది. ఆ మామిడి తోటకునీళ్ళు జల్లుతున్నాను' అన్నాడు. అందరూ గొల్లున నవ్వారు. అతనితో, 'పిచ్చివాడా! పంజాబులో గ్రామంలో వుండే మామిడితోటకు నీరు చల్లుతున్నావా? నీవు ఇప్పుడు ఎక్కడ వున్నావు? బదరీలో వున్నావు. ఇక్కడనుండి నీళ్లు అక్కడికి చేరుతాయా? నీకు పిచ్చి' అని అందరూ అన్నారు. అప్పుడు నానక్, 'చచ్చి ఏ లోకములోనో వున్న తల్లిదండ్రులకు ఇక్కడ మీరు పెట్టే పిండాలు చేరుతుంటే, నేను ఇక్కడ చల్లిన నీరు పంజాబులోని మోగా గ్రామానికి ఎందుకు చేరవు?' అని ప్రశ్నించాడు. నానక్ అక్కడివారందరికీ సూక్ష్మముగా కనువిప్పు కలిగించటానికి ఆడిన నాటకమిది. క్రతువులు చేయవచ్చు, మంత్రాలు పలుకవచ్చు. కానీ, వాటి అంతరార్థం తెలుసుకొని చేయాలి. శ్రాద్ధం పెట్టటం అంటే మరణించిన పెద్దలను స్మరించి, శ్రద్ధతో వారి పేరున ధర్మకార్యాలు చేయటమే. పిండాలు పెట్టి నదిలో వదలినప్పుడు వాటిని జలచరాలు తింటాయి. ఇది ఒకవిధముగా భూతయజ్ఞము. అంతేగాని పిండాలు పెట్టినంత మాత్రమున జన్మరాహిత్యం ప్రాప్తిస్తుందనుకోటం భ్రమ.

అక్బరు చక్రవర్తి గురునానక్‌యొక్క గొప్పతనమును గురించి విన్నాడు. అతనిని తన ఆస్థానానికి ఆహ్వానించి సత్కరించాలని సంకల్పించాడు. తన మంత్రులచే నానక్‌కు వర్తమానం పంపాడు. నానక్, 'రాజులకు రాజైన భగవంతుని పిలుపుకైనేను వేచి వున్నాను. ఎక్కడికీ రాను' అన్నాడు. ఆ వార్తను విన్న అక్బరుకు అతనిమీద పూజ్యభావం యేర్పడింది. మంత్రులతో మరొకసారి వర్తమానం పంపాడు, మసీదుకు ప్రార్ధనలకు రావలసిందని.

అనుకున్న ప్రకారము గురునానక్, అక్బర్, ఇంకా మంత్రులు మసీదులో ప్రార్థన చేయటానికి హాజరైనారు. ముందుగా మసీదులో ప్రతి దినము ప్రార్థనలు చేసే మౌల్వీ ప్రార్థన మొదలుపెట్టాడు. కన్నులు గట్టిగా మూసుకొని బిగ్గరగా అల్లాని ప్రార్థించాడు.

నానక్ ఉన్నట్లుండి బిగ్గరగా నవ్వాడు. అక్కడ ఉన్నవారందరూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు. తరువాత అక్బరు లేచి, వంగి బిగ్గరగా ప్రార్థన చేశాడు. నానక్ మరల బిగ్గరగా నవ్వాడు. మంత్రులకు చాలా కోపం వచ్చింది. ప్రార్థనలు పూర్తి అయిన తరువాత ఎంతో శాంతముగా అక్బరు, 'అయ్యా! ప్రార్థన సమయంలో మీవంటివారు ఆవిధంగా నవ్వవచ్చునా?' అని అడిగాడు. వెంటనే నానక్, 'నవ్వకుండా ఎట్లా వుండగలను? అవి ప్రార్థనలేనా! మౌల్వీ ప్రార్థన చేస్తున్నంతసేపూ తన కుమారుని జబ్బు గురించి ఆలోచిస్తుండినాడు. మరి మీరు కానుక ఈయబడిన అరేబియా గుఱ్ఱాలను గురించి చింతిస్తుండినారు. అవునా? చేసేది భగవంతుని ప్రార్థన. ఆలోచనలు లౌకికవ్యవహారములమీద. మీరే చెప్పండి, ఇటువంటి అజ్ఞానపు చర్యలను చూస్తూ నవ్వకుండా వుండగలమా!' ఈ మాటలను విన్న మౌల్వీ, అక్బర్ నానక్ పాదాలమీదపడి, 'స్వామీ! క్షమించండి. మాకు జ్ఞానోపదేశము చేశారు' అన్నారు. ప్రార్థన అనగా మాటల పరిశ్రమ కాదు. హృదయములోని దివ్యత్వమును మేలుకొల్పేందుకు పడే తపన.